సాక్షి
విశాఖపట్నం
శనివారం । 18 । ఫిబ్రవరి । 2023



విహారానికి జెట్‌స్కీ రెడీ
రుషికొండ తీరంలో జెట్‌స్కీ స్పీడ్ బోట్ శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. దీంతో పర్యాటకులు సందడి చేశారు. 8లో



గెలుపోటములు సహజం
భీమిలిలోని సెయింట్‌ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలు ప్రారంభమయ్యాయి. 8లో



సందడిగా స్కేటింగ్
అంతర్ వర్సిటీ రోలర్ స్పోర్ట్స్‌లో భాగంగా వీఎంఆర్డీఏ పార్క్‌లోని రింక్‌లో సందడిగా స్కేటింగ్ పోటీలు జరిగాయి. 8లో

న్యూస్‌రీల్

నేడూ వందేభారత్ రీషెడ్యూల్

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–సికింద్రాబాద్ (20833) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ శనివారం కూడా సుమారు రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరనుంది. ఇటీవల సికింద్రాబాద్ సమీపంలో గోదావరి ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ప్రమాదం కారణంగా ఈ రైలు ఆలస్యంగా నడుస్తోంది. శుక్రవారం ఈ రైలు విశాఖ నుంచి రెండు గంటలు ఆలస్యంగా ఉదయం 7.45 గంటలకు బయలుదేరింది. సికింద్రాబాద్‌లో 5.15గంటలకు బయలుదేరి శనివారం తెల్లవారుజామున 2.15గంటలకు విశాఖ చేరుకుంది. ఈ కారణంగా వందేభారత్‌ను శనివారం కూడా రీ షెడ్యూల్ చేసినట్లు అధికారులు తెలిపారు. విశాఖలో శనివారం ఉదయం 7 గంటలకు ఈ రైలు బయలుదేరనుంది.

ప్రశాంతంగా పర్యావరణం పరీక్ష

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పర్యావరణం పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో 338 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. నిర్ణీత షెడ్యూల్ మేరకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష జరిగింది. విద్యార్థులు సమయానికి హాజరయ్యేలా కళాశాల ప్రిన్సిపాల్స్ ముందస్తు ఏర్పాట్లు చేశారు. కేంద్రాల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మూడు జిల్లాల పరిధిలో 56,821 మంది పరీక్షకు హాజరుకాగా, 873 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఉమారాణి తెలిపారు.

20 నుంచి యోగా శిబిరం ప్రారంభం

ఏయూక్యాంపస్: ఆంధ్రవిశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి జనరల్ యోగా, స్థూలకాయ నివారణ, థెరపటిక్ యోగా తరగతులను ప్రారంభిస్తున్నట్లు యోగా కేంద్రం సంచాలకులు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు భానుకుమార్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు ఈ తరగతులు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 83743 51324, 93980 19922 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మహిళా డిగ్రీ కళాశాలలో సంస్కృత కోర్సు ప్రారంభం

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సంస్కృత విశ్వ విద్యాలయం సహకారంతో 2022–23 సంవత్సరానికి సంస్కృతం సర్టిఫికెట్ కోర్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి సంస్కృత భాష ప్రాముఖ్యం, భారతీయ సంస్కృతి, భాషలు, సంప్రదాయాలను పరిరక్షించడంపై విద్యార్థులకు వివరించారు. సుందర్ రాజ్ పెరుమాళ్ సంస్కృతం నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలు, ఉన్నత విద్యావకాశాలు, సంస్కృతంలో వృత్తి అవకాశాలపై చర్చించారు. సంస్కృత విద్యా ఉపాధ్యాయుడు సుబ్రజీత్ పహాడి సెంట్రల్ సంస్కృత విశ్వవిద్యాలయం కోర్సు, పాఠ్య ప్రణాళికపై మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డి.అరుణపద్మ పాల్గొన్నారు.

దర్శకుడు కె.విశ్వనాథ్ జయంతి రేపు

సీతంపేట (విశాఖ ఉత్తర): వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ 94వ జయంతిని ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహించనున్నట్టు సొసైటీ కార్యదర్శి నరవప్రకాశరావు తెలిపారు. స్వాతిముత్యం సినిమాకు సినిమాటోగ్రాఫర్‌గా పనిచేసిన ఎం.వి.రఘు ముఖ్య అతిథిగా పాల్గొని దర్శకుడు విశ్వనాథ్‌తో గల జ్ఞాపకాలను పంచుకుంటారని తెలిపారు. అనంతరం స్వాతిముత్యం సినిమాను ప్రదర్శిస్తామన్నారు. అందరూ ఆహ్వానితులే అని తెలిపారు.

విలేజ్ క్లినిక్‌లో వైద్య సేవలు భేష్

కేంద్ర బృందం



మాట్లాడుతున్న కేంద్ర బృంద సభ్యులు

సబ్బవరం: రాష్ట్రంలో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్‌లలో వైద్యసేవలు సంతృప్తికరంగా ఉన్నాయని కేంద్ర వైద్య బృందం ప్రశంసించింది. 'ఆయుష్మాన్ భారత్'కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాటజంగాలపాలెంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను కేంద్ర వైద్యుల బృందం సందర్శించింది. ఇక్కడ గ్రామస్తులతో బృంద సభ్యులు మాట్లాడి.. విలేజ్ హెల్త్ క్లినిక్‌లో అందుతున్న వైద్య సేవలు, మందులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతి, డీఎల్‌వో శారదాబాయి, సబ్బవరం మెడికల్ ఆఫీసర్ ఎస్.చక్రవర్తి, ఏఎన్ఎం విజయ, వైద్య సిబ్బంది శాంతి, భవాని పాల్గొన్నారు.

'క్రేజ్' కల్చర్..!



ఆర్కే బీచ్ సమీపంలో సముద్రంలో ఏర్పాటు చేస్తున్న కేజ్

- జిల్లాకు 10 యూనిట్ల మంజూరు
- ఆర్కే బీచ్‌లో ఏర్పాటు
- వీటిలో పండుగప్ప రకం చేపల పెంపకం
- మార్కెట్‌లో ఈ చేపలకు ఎంతో డిమాండ్
- కిలో రూ.500–700 పలుకుతున్న ధర
- ఒక్కో యూనిట్ వ్యయం రూ.5 లక్షలు
- 60 శాతం రాయితీతో ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సాక్షి, విశాఖపట్నం: సముద్రంలో పంజరం వంటివి ఏర్పాటు చేసి వాటిలో చేపలను పెంచే విధానాన్ని కేజ్ కల్చర్‌గా పేర్కొంటారు. వీటిలో పెరిగే చేపలకు మార్కెట్‌లో డిమాండ్ ఉంటుంది. ఇలాంటి కేజ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. కొన్నేళ్ల నుంచి సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చి ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు విశాఖ ఆర్కే బీచ్‌కు సమీపంలో సముద్రంలో కేజ్‌లను అమర్చి పరిశోధనలు సాగిస్తున్నారు. వీరు అక్కడ ఉన్న 30 కేజ్‌ల్లో వివిధ రకాల చేపలను పెంచుతున్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పీఎంఎంఎస్‌వై) ద్వారా మత్స్యకారులతో పాటు వివిధ కులాల మహిళలకు ఓపెన్ సీ కేజ్ యూనిట్లను మంజూరు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలు, మత్స్యకార మహిళలకు 60 శాతం, బీసీ మత్స్యకారులకు 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తున్నారు. ఇలా విశాఖ జిల్లాకు 18 యూనిట్లు మంజూరయ్యాయి. వీటిలో జనరల్ కేటగిరీ వారికి 14, ఎస్సీలకు 4 చొప్పున కేటాయించారు. ఒక్కో యూనిట్ విలువ రూ.5 లక్షలు. ఇందులో 10 శాతం లబ్ధిదారు వాటాగా భరిస్తే సబ్సిడీ సొమ్ము 40/60 శాతం) పోగా మిగిలినది బ్యాంకు రుణంగా సమకూరుస్తోంది. సబ్సిడీ సొమ్మును లబ్ధిదారునికి దశల వారీగా చెల్లిస్తారు. విశాఖ జిల్లాలో బి.రేవతి అనే మహిళకు 10 ఓపెన్ సీ కేజ్ యూనిట్లను మంజూరు చేశారు. వీటిని సీఎంఎఫ్ఆర్ఐ నిర్వహిస్తున్న కేజ్‌ల సమీపంలోనే ఏర్పాటు చేస్తున్నారు. ఈ కేజ్‌ల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని సీఎంఎఫ్ఆర్ శాస్త్రవేత్తలే అందజేస్తారు. అంతేకాదు.. వీరి పర్యవేక్షణలోనే కేజ్‌ల్లో చేపల పెంపకం కూడా జరుగుతుంది. చేప పిల్లలు, మేత, రవాణా తదితర అవసరాలకు సీఎంఎఫ్ఆర్ఐ సహకరిస్తుంది. విశాఖలో సముద్రంలో కేజ్‌ల ఏర్పాటు ప్రక్రియ జరుగుతోంది. నెల రోజుల్లో వీటిలో చేపల పెంపకం ప్రక్రియ ప్రారంభమవుతుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు.

కేజ్‌ల నిర్మాణం ఇలా..

ఒక్కో ఓపెన్ సీ కేజ్‌ను ఆరు మీటర్ల వ్యాసార్థంలో, నాలుగు మీటర్ల లోతులో రబ్బరు ట్యూబ్‌లు, పీవీసీ పైప్‌లతో నిర్మిస్తారు. వీటికి ప్లాస్టిక్ డ్రమ్ములు, వెదురును కూడా ఉపయోగిస్తారు. చుట్టూ ఔటర్, ఇన్నర్ నెట్‌లను ఫ్రేమ్‌ల మాదిరిగా అమరుస్తారు. ఈ కేజ్‌లు కొట్టుకుపోకుండా సముద్రంలో లైన్లు, యాంకరింగ్‌కు వీలుగా చైన్లను ఏర్పాటు చేస్తారు.

ఈ కేజ్‌ల్లో పండుగప్పల పెంపకం

విశాఖలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న కేజ్‌ల్లో పండుగప్ప రకం చేపలను పెంచనున్నారు. ప్రస్తుతం బయట మార్కెట్‌లో పండుగప్ప చేపలకు మంచి డిమాండ్ ఉంది. ఈ పండుగప్ప చేప పిల్లలను (3–4 అంగుళాల పొడవు) పాండిచ్చేరి సమీపంలోని సీడ్‌గాళిలో ఉన్న రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్ నుంచి తీసుకొచ్చి ఈ కేజ్‌ల్లో పెంచుతారు. 10–12 నెలల్లో చేప పూర్తి స్థాయిలో (కిలో వరకు బరువు) ఎదుగుతుంది. ఇలా ఒక్కో కేజ్ నుంచి 2–3 టనునల చేపల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో కిలో పండుగప్ప ధర రూ.500–700 వరకు పలుకుతోంది.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం



సాగరతీరంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే వేడుకలకు ఆర్కేబీచ్ ముస్తాబైంది. ఆర్కేబీచ్‌లో కోటి శివలింగాలను ఏర్పాటు చేశారు. శనివారం ఉదయం 38వ మహా కుంభాభిషేకంతో ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమంలో పలు పీఠాధిపతులు, టీటీడీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి పాల్గొననున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు)

నేడు, రేపు నామినేషన్లు స్వీకరించం

- కలెక్టర్, ఎన్నికల అధికారి మల్లికార్జున
- వరుసగా ప్రభుత్వ సెలవులే కారణం

మహారాణిపేట (విశాఖ దక్షిణ) : రెండు రోజుల పాటు ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి నామినేషన్లను స్వీకరించబోమని కలెక్టర్, ఎన్నికల అధికారి డా.ఎ. మల్లికార్జున తెలిపారు. శనివారం మహా శివరాత్రి ప్రభుత్వ సెలవు. 19వ తేదీ ఆదివారం సెలవు కాడంతో నామినేషన్లు స్వీకరించడం జరగదన్నారు. సోమవారం నుంచి తిరిగి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికకు సంబంధించి శుక్రవారం స్వతంత్ర అభ్యర్థి ఇల్లిపల్లి అప్పలరాజు నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జునకు నామినేషన్ పత్రాలు అందజేశారు. గురువారం రెండు సెట్ల పత్రాలు నామినేషన్ దాఖలు చేసిన స్వతంత్ర అభ్యర్థి రమాప్రభ తిరిగి శుక్రవారం మరొక రెండు సెట్ నామినేషన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు.

న్యాయవాదుల ఎన్నికల నామినేషన్లు గడువు పూర్తి

విశాఖ,లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం వార్షిక ఎన్నికల నామినేషన్ల పర్వం శుక్రవారంతో పూర్తి అయింది. ఎన్నికల్లో వందమందికి పైగా న్యాయవాదుల నామినేషన్లు దాఖలు చేశారు. కీలకమైన అధ్యక్ష పదవికి 4, ఉపాధ్యక్ష పదవికి 5, కార్యదర్శికి నలుగురు నామినేషన్లు వేశారు.

ఫార్మాకు విశాఖ అనుకూలం



గ్లోబల్ టెక్ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులు

- భవిష్యత్తులో విశాఖలో మరిన్ని సదస్సులు
- ముగిసిన గ్లోబల్ టెక్ సమ్మిట్–2023
- పాల్గొన్న వెయ్యి మంది ప్రతినిధులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): గ్లోబల్ టెక్ సమ్మిట్–2023 విశాఖ అభివృద్ధికి ఆరంభం మాత్రమే అని వక్తలు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు వుడా చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన గ్లోబల్ టెక్ సమ్మిట్ శుక్రవారం విజయవంతంగా ముగిసింది. సదస్సులో ఫార్మా పరిశ్రమల అభివృద్ధి, సాంకేతిక వినియోగంపై చర్చించారు. అలాగే వివిధ రంగాల్లో ఐటీ వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. విశాఖలో ఐటీ కంపెనీల ఏర్పాటుకు తీసుకోవాల్సిన చర్యలు..ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై చర్చించారు. అలాగే మరో వైపు తమ స్టార్టప్‌లను వివరిస్తూ సలహాలు, సూచనలు స్వీకరించారు. విశాఖలో ఫార్మా రంగం అభివృద్ధికి మంచి అవకాశాలు ఉన్నాయని ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఆధ్యక్షుడు నారాయణ తెలిపారు. అతి తక్కువ వ్యయంతో నాణ్యమైన మందులను ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు. విశాఖలో ఫార్మా బల్క్ ఉత్పత్తుల పరిశ్రమలు ఉన్నాయని, కానీ ఫార్ములా తయారీ చేసే పరిశ్రమలు లేవన్నారు. వాటిని స్థాపించడం వలన అనేక మందికి ఉపాధి కలుగుతుందన్నారు.

జీ–20 దేశాల్లో సదస్సు

గ్లోబల్ టెక్ సమ్మిట్‌ను జీ20 దేశాల్లో నిర్వహిస్తామని కో కన్వీనర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. 20 దేశంలో నిర్వహించిన తరువాత మళ్లీ ముగింపు సమ్మిట్ విశాఖలోనే నిర్వహిస్తామని తెలిపారు. రెండు రోజుల సమ్మిట్‌లో 1000 మంది ప్రతినిధులు పాల్గొన్నారని వారిలో 400 మంది విదేశీ ప్రతినిధులు ఉన్నారన్నారు. విశాఖలో పెద్ద పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీల కంటే ముందు బీపీఎల్ కంపెనీలు ఏర్పాటు ముఖ్యమన్నారు. రాష్ట్ర జీడీపీలో ఐటీ రంగానిదే కీలకపాత్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి సుమారు 25 లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్నారని పేర్కొన్నారు. అయితే వారిలో చాలా తక్కువ మంది ఆంధ్రప్రదేశ్ పనిచేస్తున్నారన్నారు. భవిష్యత్తులో వారందరూ విశాఖలో పనిచేసే విధంగా సంస్థలు ఏర్పాటవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

సాంకేతికతతో రియల్ ఎస్టేట్ మరింత అభివృద్ధి



రియల్ ఎస్టేట్ రంగంలో సాంకేతికతను జోడించడంతో మరింత వేగంగా అభివృద్ధి సాధ్యమవుతుంది. అతి తక్కువ సమయంలోనే ఎక్కువ మందికి వ్యాపారం చేరువయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది. ఇటువంటి సదస్సుల ద్వారా మరింత సాంకేతికతను ఎలా అనుసంధానం చేయాలని తెలుసుకోవచ్చు.

– ముక్క ఓబుల్ రెడ్డి, చైర్మన్ హనీ గ్రూప్



టెక్ సదస్సుకు హాజరైన వివిధ దేశాల ప్రతినిధులు

35 కేంద్రాల్లో ఎస్ఐ ప్రిలిమ్స్ పరీక్షలు

దొండపర్తి: రాష్ట్ర పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్ ఆధ్వర్యంలో ఎస్ఐ సివిల్, ఏఆర్ ఎస్ఐ అభ్యర్థుల నియామకానికి సంబంధించి ఈ నెల 19న నగరంలో 35 కేంద్రాల్లో ప్రిలిమినరీ రాత పరీక్ష నిర్వహిస్తున్నట్లు నగర పోలీస్ కమిషనర్ సి.హెచ్.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజున ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పేపర్–2 పరీక్ష ఉంటుందన్నారు. ఈ రాత పరీక్షకు పురుషులు 18,666 మంది, మహిళలు 5,216 మంది మొత్తంగా 23,882 మంది హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా అభ్యర్థులకు సీపీ పలు సూచనలు చేశారు.

- పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు నిర్ణీత సమయం కంటే గంట ముందుగా కేంద్రాలకు హాజరుకావాలి.
- అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా ఓ ఫొటో గుర్తింపు కార్డును తీసుకురావాలి.
- పరీక్షలో బ్లాక్, బ్లూ బాల్ పాయింట్ పెన్ మాత్రమే వినియోగించాలి.
- కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు(సెల్‌ఫోన్, కాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్, బ్యాగ్‌లు, బ్లూటూత్ వంటివి) అనుమతించరు.
- అభ్యర్థులు వారి వెంట తెచ్చుకునే విలువైన సామాన్లను వారే భద్రపర్చుకోవాలి.
- అభ్యర్థుల కోసం ఆర్టీసీ అధికారులు ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పరీక్ష కేంద్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు.
- కేంద్రాల చుట్టుపక్కల ఎటువంటి లౌడ్ స్పీకర్లు, మైకులు అనుమతించరు.
- కేంద్రాల వద్ద ఉన్న జిరాక్స్ షాపులు, ఫొటో స్టూడియోలు పరీక్ష సమయంలో మూసివేయాలి.
- కేంద్రాల వద్ద సెక్షన్ 144 సీఆర్‌సీపీ అమలులో ఉంటుంది. ప్రజలు గుంపులుగా ఉండకూడదు.
- బందోబస్తు నిర్వర్తించే సమయంలో అభ్యర్థులు, ప్రజలు పోలీసులకు సహకరించాలి.

భారత్-ఆస్ట్రేలియా మ్యాచ్‌పై సమీక్ష



వివరాలు వెల్లడిస్తున్న నిర్వాహక కమిటీ



స్టేడియం ప్రవేశద్వారం వద్ద ట్రాఫిక్ నియంత్రణపై చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ శ్రీకాంత్

- మార్చి 19న డే అండ్ నైట్ మ్యాచ్
- ఏర్పాట్లపై చర్చించిన నిర్వాహక కమిటీ

విశాఖ స్పోర్ట్స్ : భారత్– ఆస్ట్రేలియా మ్యాచ్‌కు విశాఖ సిద్ధమవుతోంది. మార్చి 19న డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి క్రికెట్ స్టేడియంలో డే అండ్ నైట్ మ్యాచ్ జరగనుంది. రెండో వన్డే ఏర్పాట్లపై నిర్వాహక కమిటీ శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. ఆ వివరాలను మీడియాకు వివరించింది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పూర్తిగా మ్యాచ్ విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నామని నిర్వాహక కమిటీ వైస్ చైర్మన్, కలెక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. వైద్య సదుపాయాలు, టికెటింగ్ నిర్వాహణ తదితర అంశాలను స్వయంగా పర్యవేక్షిస్తున్నట్టు చెప్పారు. వేసవి ప్రారంభం కానుండటంతో మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే పిల్లలు, పెద్దలను సైతం దృష్టిలో పెట్టుకుని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఎటువంటి ట్రాఫిక్ సమస్య ఎదురుకాకుండా చూస్తామన్నారు. ఆటగాళ్ల భద్రతతో పాటు అభిమానుల భద్రతకు గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. మ్యాచ్‌ను పూర్తిగా ఆస్వాదించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. జీవీఎంసీ కమిషనర్ పి.రాజబాబు మాట్లాడుతూ స్టేడియంలో శానిటేషన్‌పై పూర్తి శ్రద్ధ వహిస్తామన్నారు. ఏసీఏ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథరెడ్డి మాట్లాడుతూ టికెట్ల ధర, విక్రయం తదితర అంశాలను అపెక్స్ కౌన్సిల్‌లో నిర్ణయం అనంతరం ప్రకటిస్తామన్నారు. జిల్లా అధికార యంత్రాంగం వచ్చేనెల 19న జరిగే డే అండ్ నైట్ వన్డేకు పూర్తి సహకారం అందిస్తుందన్నారు. స్టేడియం కెపాసిటీలో 70 శాతం టిక్కెట్లను ఆన్‌లైన్ ద్వారా 30 శాతం టిక్కెట్లను నేరుగా విక్రయించేందుకు అవకాశం ఉందన్నారు.

పసికందు ఘటనపై సమగ్ర విచారణ

- ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లడం దురదృష్టకరం
- పలు శాఖల సమన్వయం లోపం వల్లే...
- రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేదు
- ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు



కేజీహెచ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబు

మహారాణిపేట: కేజీహెచ్ నుంచి పసికందు మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లిన సంఘటనలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సంబంధం లేదని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ కుంభా రవిబాబు కోరారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఇతర వైద్యులు, ఎస్టీ సెల్ ఇన్‌చార్జి రామకృష్ణతో రవిబాబు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవిబాబు మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం దురదృష్టకరమన్నారు. పలు శాఖల సమన్వయ లోపం కనిపిస్తోందని, ఇలాంటి సంఘటన మరోసారి పునరావృతం కాకూడదన్నారు. గిరిజనుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. గిరిజన ప్రాంతాల్లో ఏడు సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు ఏర్పాటు చేయడంతోపాటు పాడేరులో మెడికల్ కాలేజీ ఏర్పాటు చేస్తున్నారన్నారు. గిరిజనుల ఆరోగ్యం కోసం ఎంత ఖర్చు అయినా భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అయితే సమన్వయ లోపం వల్ల బిడ్డను తల్లి కోల్పోయిందన్నారు. పాడేరు ఆస్పత్రిలో చేరిన మహేశ్వరికి నొప్పులు రాకపోయినా వైద్యులు డెలివరీ చేశారని, ఫలితంగా బిడ్డ అనారోగ్యంతో పుట్టారని రవిబాబు అన్నారు. కేజీహెచ్‌లో పసిబిడ్డకు చికిత్స అందిస్తున్న వైద్యులు వెంటిలేటర్ ఎందుకు తొలగించారని ప్రశ్నించారు. ఈ క్రమంలో పసికందు గురువారం ఉదయం 7.50 గంటలకు చనిపోతే... ఎస్టీ సెల్‌కు 9.50 గంటలకు సమాచారం ఇచ్చారని, ఇందులో సమన్వయ లోపం ఉందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని డీఎంఈకి ఫోన్ చేసి కోరారు. చనిపోయిన తర్వాత ఒక గంట ఉంటే అంబులెన్సు ఏర్పాటు చేసేవారన్నారు.

- ప్రస్తుతం కేజీహెచ్‌లో ఉన్న ఎస్టీ సెల్ సిబ్బందిని మార్పు చేయాలని, అక్కడ వైద్యుడిని నియమించాలని కలెక్టర్ మల్లికార్జునను కుంబా రవిబాబు కోరారు. ఇక్కడి సిబ్బంది పనితీరుపై ఆరోపణలు రావడంతో మార్పు చేసి కొత్తవారిని నియమించాలని కోరారు.

ఇద్దరు నర్సులకు చార్జి మెమోలు

కేజీహెచ్ పిల్లల వార్డులో పసికందు మృతిపై సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ క్రమశిక్షణ చర్యలకు ఉపక్రమించారు. వార్డులో ఇద్దరు నర్సులకు చార్జి మెమోలు జారీ చేశారు. వారం రోజుల వ్యవధిలో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు.

విచారణ కమిటీ నియామకం

కేజీహెచ్‌లో పసికందు మృతి, అనంతరం మృతదేహాన్ని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లిన సంఘటనపై ఇద్దరు సభ్యులతో విచారణ కమిటీని నియమించారు. కేజీహెచ్ డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవను కమిటీ సభ్యులుగా నియమిస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ మూడు రోజుల్లో విచారణ జరిపి నివేదిక సమర్పిస్తుంది.

సుమోటోగా స్వీకరించి నోటీసులు జారీ

- పసికందు ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నిర్ణయం

మహారాణిపేట: కేజీహెచ్‌లో పసికందు మృతి, అనంతరం ద్విచక్ర వాహనంపై తరలించిన ఘటనను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఈ కేసును సుమోటోగా స్వీకరించి సంబంధిత అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేయనున్నామని కమిషన్ సభ్యులు డాక్టర్ గొండు సీతారాం తెలిపారు. శుక్రవారం ఆయన కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్, ఆర్ఎంవో, ఏఆర్ఎంవో, ఎస్టీ సెల్ సిబ్బందితో సమావేశమయ్యారు. గిరిజన ప్రాంతాల నుంచి కేజీహెచ్‌కు చేరుకునేందుకు ఎన్ని అంబులెన్స్‌లు ఉన్నాయి?, చనిపోయిన వారిని సొంత ప్రాంతాలకు ఎలా చేరవేస్తున్నారు?, ప్రత్యామ్నాయ రవాణా ఏర్పాట్లు చేస్తున్నారా..? అని ఆరా తీశారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పిల్లల వైద్యులు బి.ఎస్.చక్రవర్తి, వాసుదేవ, చక్రవర్తి, రమ్య, అరుణ దేవి, భవానీశంకర్, 1098 జిల్లా కోఆర్డినేటర్ డేవిడ్ రాజు, డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రమేష్, సీఆర్పీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శకుంతల పాల్గొన్నారు.

కేజీహెచ్ ఎస్టీ సెల్‌పై పర్యవేక్షణేదీ?

సిబ్బందిపై ఆరోపణలు!

మహారాణిపేట: గిరిజన రోగుల కోసం కేజీహెచ్ క్యాజువాల్టీ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎస్టీ సెల్‌పై పర్యవేక్షణ కరువైంది. ఇక్కడి సిబ్బందిపై గతంలోనూ ఆరోపణలు వెల్లువెత్తగా.. ఎవరూ పట్టించుకోకపోవడంతో వారంతా ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పాడేరు ఐటీడీఏ ఆధ్వర్యంలో గిరిజన సేవా, సమాచార కేంద్రం పేరిట ఇక్కడ ఎస్టీ సెల్‌ను ఏర్పాటు చేశారు. కానీ పాడేరు ఐటీడీఏ పర్యవేక్షించడం లేదనే విమర్శలు ఉన్నాయి. జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ఇక్కడ సిబ్బంది తీరుపై పలువురు సభ్యులు ఆరోపణలు చేశారు. సిబ్బందితోపాటు అప్పటి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.మైథిలి సమావేశానికి వచ్చి వివరణ ఇచ్చారు. అయినా ఎస్టీ సెల్ సిబ్బంది తీరులో ఎలాంటి మార్పు రాలేదని గిరిజనులు వాపోతున్నారు. కేజీహెచ్‌కు మన్యం ప్రాంతానికి చెందిన 11 మండలాల గిరిజనులతోపాటు ఉత్తరాంధ్ర ప్రాంతం, ఒడిశా, చత్తీస్‌గఢ్ ప్రాంతానికి చెందిన గిరిజనులు వైద్యం కోసం వస్తుంటారు. నెలకు నాలుగు వేల మంది గిరిజనులు చికిత్స పొందుతుంటారు. వారి ఆరోగ్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు కేటాయిస్తోంది. కాగా..ఇక్కడ నలుగురు సిబ్బంది ప్రస్తుతం విధులు నిర్వర్తిస్తున్నారు. మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే గిరిజనులను వైద్యుల వద్దకు తీసుకెళ్లి చూపించాల్సిన బాధ్యత ఈ సెల్‌పై ఉంది. అవసరమైన పరీక్షలు, స్కానింగ్ చేయడంతో పాటు గిరిజనులకు భోజనాలు, మందులు, తిరుగు ప్రయాణానికి ఖర్చులు కూడా ఇవ్వాల్సిన బాధ్యత ఈ సెల్‌దే. కానీ దీనికి భిన్నంగా ఇక్కడ సిబ్బంది వ్యవహరిస్తున్నారు. గిరిజనులను మభ్యపెట్టి.. ఉచితంగా సేవలందించాల్సిన చోట వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.



కేజీహెచ్ క్యాజువాల్టీ వద్ద ఏర్పాటు చేసిన ఎస్టీ సెల్

ప్రణాళికా విభాగం స్పందనకు 10 ఫిర్యాదులు

అల్లిపురం: జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగంపై శుక్రవారం నిర్వహించిన స్పందనకు 10 ఫిర్యాదులు అందాయి. పట్టణ ప్రణాళిక అధికారి బి.సురేష్‌కుమార్ ఫిర్యాదులు స్వీకరించారు. 3వ జోన్ నుంచి 3, నాల్గో జోన్ నుంచి 2, 5వ జోన్ నుంచి 4, 8వ జోన్ నుంచి ఒక ఫిర్యాదు అందినట్లు తెలిపారు. జీవీఎంసీ పరిధిలో అనధికార నిర్మాణాలపై 1800 4250 0009 ఫోన్ ద్వారా లేదా 81878 97569కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. డిప్యూటీ సిటీప్లానర్ సంధ్య రత్నకుమార్, నరేంద్రనాథ్ రెడ్డి, కె.పద్మజ, ఏసీపీలు, టీపీవో, టీపీఎస్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న పట్టణ ప్రణాళిక అధికారి సురేష్‌కుమార్

వైవీ సుబ్బారెడ్డికి సాదర స్వాగతం



విశాఖ విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న వైవీ సుబ్బారెడ్డి

గోపాలపట్నం: తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి శుక్రవారం విశాఖ విమానాశ్రయంలో సాదర స్వాగతం లభించింది. అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు విమానాశ్రయానికి తరలి వచ్చి.. ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె.రాజు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, పల్లా చినతల్లి తదితరులు పాల్గొన్నారు.

సముద్ర విహారానికి జెట్‌స్కీ రెడీ

కొమ్మాది: రుషికొండ తీరంలో జెట్‌స్కీ స్పీడ్ బోట్ శుక్రవారం అందుబాటులోకి వచ్చింది. గతంలో రుషికొండ బీచ్‌లో రెండు జెట్ స్కీలను బోటు షికారుకు ఉపయోగించేవారు. అవి కాలక్రమేణా మరమ్మతులకు గురికావడంతో మూలకు చేరాయి. దీంతో పర్యాటకులకు బోటు షికారు దూరమైంది. తాజాగా చెన్నై నుంచి తెప్పించిన ఈ బోటును విజయవాడ వద్ద కృష్ణా నదిలో ట్రయల్ రన్ నిర్వహించి.. ఇక్కడ బీచ్‌లో ప్రారంభించారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

భీమునిపట్నం: ప్రతీ జట్టులోని ఆటగాళ్లు విజయమే లక్ష్యంగా పట్టుదలతో ఆడాలని విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ) జ్యోతికుమారి పిలుపునిచ్చారు. భీమిలిలోని సెయింట్‌ఆన్స్ ఎయిడెడ్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరగనున్న అండర్ 14 రాష్ట్రస్థాయి బాలబాలికల ఖోఖో పోటీలను శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సహజమని.. ఓడిన వారు ఏ మాత్రం నిరాశ చెందొద్దని సూచించారు. రెట్టింపు ఉత్సాహంతో మరింత కష్టపడి రాబోయే పోటీల్లో గెలవాలన్నారు. అన్ని రకాల క్రీడలు, ఆటలు ఆడే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని.. ఇది వారి భవిష్యత్‌కే కాకుండా ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుందన్నారు. జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ఆరోగ్యకరమైన పోటీతత్వం ఉండాలని..క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కాగా.. ఈ పోటీల్లో విశాఖపట్నం, అనంతపురం, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, గుంటూరు, ప్రకాశం, విజయనగరం జిల్లాలకు చెందిన జట్లు పాల్గొంటున్నాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి సీహెచ్.వెంకటరెడ్డి, సెయింట్ ఆన్స్ కో–ఆర్డినేటర్ ట్రీషా మేరీ పాల్గొన్నారు.



క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించి, మాట్లాడుతున్న ఆర్జేడీ జ్యోతికుమారి

సమస్యల పరిష్కారమే ధ్యేయం

విశాఖ లీగల్ : ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తానని జేసీ విశ్వనాథన్ అన్నారు. శుక్రవారం సాయంత్రం సిరిపురం వీఎంఆర్‌డీఏ ఎరీనా భవనంలోని వినియోగదారుల న్యాయస్థానం–2 ప్రథమ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వినియోగదారుల హక్కులు, ప్రభుత్వ సేవలపై ప్రసంగించారు. భూ సమస్యలు, వినియోగదారుల న్యాయస్థానాల్లో పెండింగ్ కేసులు, ప్రజా స్పందన, ప్రభుత్వ కేసుల సత్వర పరిష్కారం వంటి అంశాలను వివరించారు. వినియోగదారుల న్యాయస్థానాల శాశ్వత భవన నిర్మాణానికి నగరంలో తగిన ప్రాంతాన్ని కేటాయించడానికి చర్యలు చేపడతామన్నారు. న్యాయమూర్తి జి.వెంకటేశ్వరి మాట్లాడుతూ ఏడాది కాలంలో 60 శాతానికి పైగా కేసుల విచారణ పూర్తి చేసి తీర్పులు ఇచ్చామన్నారు. వినియోగదారుల కేసుల్లో సీనియర్ న్యాయవాది నాగేశ్వర్వరావు మాట్లాడారు. అనంతరం నాగేశ్వరావును జేసీ విశ్వనాథన్ సత్కరించారు. కార్యక్రమంలో న్యాయస్థానం సభ్యులు డాక్టర్ కరక రమణ బాబు, పి.విజయదుర్గ, సీనియర్ రాజారావు, పి.లీలావతి, వినియోగదారుల సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలోని కొత్తవలస–కిరండూల్ లైన్‌లో సుకు–కోరాపుట్ సెక్షన్ మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పిన కారణంగా శుక్రవారం ఈ మార్గంలో ప్రయాణించే విశాఖపట్నం–కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేశారు. పాసింజర్ స్పెషల్‌ను గమ్యం కుదించినట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె. త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

- 17వ తేదీ శుక్రవారం రాత్రి విశాఖపట్నంలో బయలుదేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్, కిరండూల్‌లో బయలుదేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (18513) ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు.
- 17వ తేదీ శుక్రవారం ఉదయం విశాఖపట్నంలో బయలుదేరిన విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్ పాలిబ వద్ద నిలిపివేశారు. అక్కడి నుంచి కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్‌గా తిరిగి విశాఖపట్నం చేరుకుంది.
- 17వ తేదీ శుక్రవారం కిరండూల్‌లో బయలుదేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(08552) పాసింజర్ స్పెషల్ కోరాపుట్ వద్ద నిలిపివేశారు. అక్కడ నుంచి విశాఖపట్నం–కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్‌గా కిరండూల్ చేరుకుంది.

ఆధ్యాత్మిక శక్తి కేంద్రంగా భారత్

అల్లిపురం: ఆధ్యాత్మిక శక్తి కేంద్రం భారతదేశం అని జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. డాబాగార్డెన్స్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం, వైజాగ్ జర్నలిస్ట్ ఫోరం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో మహా శివరాత్రి పర్వదిన మహోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం ప్రతినిధి రమా మాట్లాడుతూ మహారాణిపేట అఫీసియల్ కాలనీలో మూడు రోజుల పాటు శివరాత్రి పండగను వైభవోపేతంగా నిర్వహిస్తామన్నారు. వీజేఎఫ్ కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారీస్ విశ్వ విద్యాలయం ప్రతినిధి శివలీలా, వీజేఎఫ్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శివరాత్రి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు

భారత ప్రభుత్వం
ఆర్థిక మంత్రిత్వశాఖ, డిపార్టుమెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్
డెట్స్ రికవరి ట్రిబ్యునల్
నెం. 31-31-21, నారాయణభవనం, సాయిబాబావీధి, దాబాగార్డెన్స్, విశాఖపట్నం - 530 020
ఫోన్: 0891-2957045, ఇ-మెయిల్ ఐడి: ro2.drtvpatnam@gmail.com

ఒ.ఎ.నెం. 834/2016 లోని ఆర్.పి. నెం. 20/2016

బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూర్యాభాగ్, విశాఖపట్నం [illegible]

విషయం: ఇ-వేలం వాయిదా

[illegible] తేది. 30-12-2022 [illegible] https://www.bankeauctions.com [illegible] అభ్యర్థన మేరకు తేది.07-03-2023 నకు వాయిదా వేయడమైనది.
2. బిడ్స్ దాఖలుకు మరియు బయానాకు ఆఖరు తేది. 03-03-2023 వరకు పొడిగించడమైనది మరియు బిడ్స్ హార్డ్‌కాపీ 06-03-2023న దాఖలు చేయవచ్చును. సదరు సేల్ ప్రొక్లమేషన్ / ఇ-వేలం అమ్మకం ప్రకటన తేది. 30-12-2022 నందు తెలిపిన మిగిలిన అన్ని ఇతర నియమ నిబంధనలలో మార్పు లేదు.
(నేను స్వయంగా మరియు ఈ ట్రిబ్యునల్ ముద్రికతో విశాఖపట్నం వద్ద తేది. 17-02-2023న జారీచేయడమైనది)
(బి.ఎస్.ఎస్.వి.ఎస్.కె.బంగార్రాజు)
రికవరీ అధికారి

ఉత్సాహంగా స్కేటింగ్ పోటీలు

విశాఖ స్పోర్ట్స్: అంతర్ వర్సిటీ రోలర్ స్పోర్ట్స్‌లో భాగంగా శుక్రవారం జరిగిన 10 వేల మీటర్ల రింక్‌రేస్ వుమెన్‌లో రియా ఎలిజిబెత్, మెన్‌లో ఆనంద్‌కుమార్ విజేతలుగా నిలిచారు. వుమెన్‌లో కస్తూరి, రచిత, మెన్‌లో ధ్రువ్ దహియా, చస్మిత్ సింగ్ ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. 1000 మీటర్ల రింక్‌రేస్ వుమెన్‌లో రచిత, మెన్‌లో ఆర్యన్‌పాల్‌సింగ్ విజేతలుగా నిలవగా వుమెన్‌లో రియా ఎలిజిబెత్, జాన్వి, మెన్‌లో ఆనందకుమార్, చస్మిత్‌సింగ్ తర్వాత రెండు స్థానాలు సాధించారు. ఇన్‌లైన్ ఫ్రీస్టయిల్ వుమెన్‌లో ధనస్, ఆశ్రిత, గోపిక, మెన్‌లో జినేష్, సంచిత్, అభిషేక్ తొలి మూడు స్థానాల్లో నిలిచారు. స్కేట్‌బోర్డ్ వుమెన్‌లో రమ్యశ్రీ, పూర్ణిశ, సువిధాకిరణ్, మెన్‌లో షణ్ముఖరాకేష్, నాగరంగ మౌర్య, పవన్ కార్తీకేయ తొలి మూడు స్థానాలు సాధించారు. ఏయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలు వీఎంఆర్డీఏ పార్కులోని రింక్‌ల్లో జరిగాయి.

వివాహితతో అసభ్య ప్రవర్తన

ఇద్దరి యువకుల అరెస్ట్

అల్లిపురం: జిగ్‌జాగ్ డ్రైవింగ్, హారన్ మోతలతో ఇబ్బంది పెట్టడమే కాకుండా ప్రశ్నించిన వ్యక్తి, అతని భార్యపై అసభ్యంగా ప్రవర్తించి గాయపరిచిన ఇద్దరు యువకులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హార్బర్ జోన్ ఏసీపీ శ్రీరాముల శిరీష ఈ వివరాలు వెల్లడించారు. రంగిరీజువీధి జమ్మిచెట్టు ప్రాంతానికి చెందిన సుధాదేవి, రాజు బుధవారం రాత్రి షాపింగ్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన వీర్రాజు, సంపత్ తమ బైక్‌పై ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ వికృతంగా హారన్ కొట్టుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో సుధాదేవి కుమార్తె భయంతో గట్టిగా అరిచి ఏడ్చింది. దీంతో వారిద్దరినీ భార్యాభర్తలు ఆపి నిలదీయడంతో వారు వాగ్వాదానికి దిగారు. సుధాదేవితో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా ఆమె దుస్తులు చించివేశారు. దీంతో ఆమె తన సోదరుడు వంగలపూడి అభిలాష్ కుమార్‌ను పిలవటంతో అతను వచ్చి నిందితులను ప్రశ్నించాడు. అతనిపై కూడా వారు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కుటుంబం మొత్తం గాయపడటంతో వారు కేజీహెచ్‌లో చికిత్స పొందారు.

బాధితురాలు సుధాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన వన్‌టౌన్ సీఐ రేవతి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితులు ఎటువంటి గంజాయి, ఇతర మత్తు పదార్థాలు సేవించలేదని ఏసీపీ తెలిపారు. రంగిరీజువీధి ప్రాంతంలో ఎటువంటి గంజాయి వినియోగం జరగడం లేదన్నారు. సమావేశంలో సీఐ రేవతి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీరాముల శిరీష

ఒడిశా వాసి అనుమానాస్పద మృతి


అల్లిపురం: ఒడిశా వాసి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగుచూసింది. సీఐ తిరుమలరావు తెలిపిన వివరాలివీ.. కొబ్బరితోట నేతాజీనగర్ ప్రాంతంలో ఈ నెల 15 తెల్లవారుజామున ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో ఉన్నట్లు స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని.. ఒడిశాలోని రాయగడకు చెందిన రమేష్ నాయక్‌గా గుర్తించారు. అతని తలపై తీవ్రగాయాలు ఉండటంతో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న అతను గురువారం మృతి చెందాడు.

హత్యగా అనుమానం?

మృతి చెందిన రమేష్ నాయక్‌ది హత్యగా స్థానికులు అనుమానిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి టూటౌన్ పోలీసులు శుక్రవారం ఉదయం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తాము ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని చెప్పారు.

సముద్రంలో దూకి యువకుడి ఆత్మహత్య?

కొమ్మాది: సీతంపేటకు చెందిన కామిన శ్రీను(25) మృతదేహం శుక్రవారం రుషికొండ బే పార్క్ ఎదురుగా ఉన్న సముద్ర తీరానికి కొట్టుకొచ్చింది. బీచ్‌లో వాకింగ్‌కు వెళ్లిన గొల్లల ఎండాడకు చెందిన యువకులు మృతదేహం గుర్తించి.. ఆరిలోవ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు లైఫ్ గార్డుల సహాయంతో మృతదేహాన్ని ఒడ్డుకు తీసుకొచ్చారు. కాగా.. సాగర్‌నగర్ బీచ్‌లో శ్రీను దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు పలువురు పర్యాటకులు తెలిపారు. అతని ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. అతను మినరల్ వాటర్ క్యాన్లను ఇంటింటికీ సరఫరా చేస్తుంటాడు. పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు.



తీరానికి కొట్టుకుని వచ్చిన మృతదేహం

ఆర్జేడీపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు

వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ డిమాండ్

విశాఖ విద్య: విధి నిర్వహణలో ఉన్న విద్యాశాఖ ఆర్జేడీ ప్రతాపరెడ్డిపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చొక్కాకుల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. నగరంలో శుక్రవారం జరిగిన ఫెడరేషన్ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాశాఖ కార్యకలాపాలు పర్యవేక్షణలో భాగంగా ఉన్నతాధికారుల పర్యటనలు సహజమని, వాటిని రాజకీయాలకు ఆపాదించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన రీతిలో స్పందించాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్జేడీ ప్రతాపరెడ్డికి ప్రభుత్వం తగిన భద్రత కల్పించాలన్నారు. వారి కుటుంబానికి ఎటువంటి ఇబ్బందులు కల్పించినా.. తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నాయకులు జిల్లా కార్యదర్శి గంగాధర్, సురేష్, గోవింద్, రొంగలి మంగునాయుడు తదితరులు పాల్గొన్నారు.